
# బాబోయ్ పెట్రోల్ దొంగలు



కంచరపాలెంలో ఆకతాయిల బెడద పెరిగింది. **మత్తుకు అలవాటు పడిన** కొంత మంది యువత వీధుల్లో పార్క్ చేసిన **ద్విచక్రవాహనాల నుంచి** పెట్రోల్ చోరీ చేయడంతో పాటు చిన్న చిన్న **పార్ట్‌లు అప** హరించి వాటిని స్క్రాప్ దుకాణాలకు విక్రయి**స్తున్నారు.** అంతటితో ఆగకుండా మహిళలు రాత్రి వేళ **ఒంటరిగా** వెళితే వెకిలిగా ప్రవర్తిస్తున్నారు. దీంతో ఈ **ప్రాంత** ప్రజలు రాత్రి వేళ పోలీసుల గస్తీ పెంచాలని **వేడుకుం**టున్నారు.

## మత్తులో రాత్రి వేళ రెచ్చిపోతున్న ఆకతాయిలు

- వాహనాల నుంచి ఇంధనం చోరీ
- మహిళలపై దురుసు ప్రవర్తన
- రాత్రి గస్తీ పెంచాలని స్థానికుల మొర

**కంచరపాలెం:** చెడు వ్యసనాలకు బానిసలైన యువత రాత్రి పూట వీధుల్లో హల్‌చల్ చేస్తున్నారు. జీవీఎంసీ 56, 57వ వార్డుల పరిధిలోని కంచరపాలెం, ఐటీఐ జంక్షన్, ఊర్వశికూడలి పరిసర ప్రాంతాల్లో ఆకతాయిల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుందని ఆయా కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. **గవర కంచరపాలెం, రామ్మూర్తిపంతుల పేట, చాకలిగెడ్డ దయానందనగర్, గొల్లకంచరపా**లెం, తోటవీధి, దుర్గానగర్, చెవిటిరాములవీధి, గోకుల్‌నగర్, మళ్లసూరివీధి, గౌరీనగర్, సుభాష్‌నగర్, తుమ్మడపాలెం, భవానీగార్డెన్స్ తదితర కాలనీల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు పార్కింగ్ చేస్తుంటారు. రాత్రి సమయాల్లో పార్కింగ్ చేసిన వాహనాల నుంచి పెట్రోల్, డీజిల్ చోరీ చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్ల టైర్లు, వీల్‌కు ఉన్న ప్లేట్లు సైతం అపహరిస్తున్నారని చెబుతున్నారు.




రామ్మూర్తిపంతులపేటలో పెట్రోల్ దొంగతనం చేస్తున్న సీసీ ఫుటేజీ

### పెట్రోల్ చోరీ చేసి రైడ్‌లకు..

ద్విచక్ర వాహనాల పెట్రోల్ పైపులను కత్తిరించి వాటర్ బాటిల్ పెట్టి అటుగా రాకపోకలు చేసి బాటిల్ నిండిన తర్వాత వారి ద్విచక్ర వాహనాల్లో వేసి విలాసాలు చేస్తున్నారు. అర్ధరాత్రులు హారన్లు మోగించి విర్రవీగుతున్నారు. పెట్రోలు చోరీ ఘటనలు పలు ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీల్లో నమోదు అవడంతో స్థానికులు భయపడుతున్నారు. జల్సాలకు అలవాటు పడిన యువత ఏ సంఘటనకైనా పూనుకుంటున్నారని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

### మద్యపానం.. ధూమపానానికి అడ్డా

**తోటవీధి రైల్వేట్రాక్** నుంచి గౌరీనగర్‌కు వెళ్లే ప్రాంతాల్లో ఆటోల్లో కొందరు **మద్యపానం, ధూ**మపానం చేస్తూ అటుగా వెళ్లే బాలికలు, మహిళల పట్ల **అసభ్యకరంగా** ప్రవర్తిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **సాయంత్రం పూట** పిల్లలు ట్యూషన్లు, బయటకు వెళ్లి వచ్చేంత వరకు **భయాందోళనగా** ఉంటుందని పలువురు తల్లిదండ్రులు వాపోతున్నారు. **ఆయా ప్రాంతాల్లో** దూరప్రాంతాల నుంచి వచ్చే యువత స్థానిక యువ**కులతో కలిసి** ఇలాంటి పనులు చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. **పోలీసులు ఉన్నతాధికారు**లు పర్యవేక్షణ చేసి గస్తీ మరింత **పెంచాలని స్థానికులు కో**రుతున్నారు.



గౌరీనగర్‌లో అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో వాహనాల వద్ద దొంగల హడావుడి సీసీ కెమెరాలో ఇలా



పార్కింగ్ చేసిన వాహనాలు

### పెట్రోల్ దొంగతనాల జోరు

మా గ్రామంలో రాత్రి సమయంలో పార్కింగ్ చేసిన వాహనాలు నుంచి శనివారం, పండగ ముందు దినాల్లో పెట్రోలు, డీజిల్ దొంగతనాలు చేస్తున్నారు. జనం నిద్రించే వేళలో ద్విచక్ర వాహనాల పెట్రోలు పైపులను కత్తిరించి బాటిళ్లు పెట్టి నిండిన తర్వాత వాటిని తీసుకెళ్తున్నారు.

–బి.ఆనంద్, రామ్మూర్తిపంతులుపేట, కంచరపాలెం.

### అధికారులు స్పందించాలి

వార్డుల్లో రాత్రి పూట జరుగుతున్న దొంగతనాలపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. యువత పెడ మార్గం పట్టి పెట్రోల్, డీజిల్ దొంగతనాలు ఒక వ్యసనంగా పెట్టుకున్నారు. ఎవరైనా అడిగితే మద్యం మత్తులో తిరగబడుతున్నారు. మొక్కుబడిగా తిరుగుతున్న గస్తీని మరింత పెంచాలి. ఉన్నతాధికారులు స్పందించాలి.

–ఎస్.మాధవరావు, గౌరీనగర్, ఊర్వశికూడలి

## ఉద్యోగుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

**గోపాలపట్నం:** నేవల్ ఆర్మమెంట్ డిపో ఉద్యోగుల సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని, స్టోరేజ్ ఓటీ బుకింగ్ కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఎన్ఏడీ మెయిన్ గేటు వద్ద నేవల్ ఆర్మమెంట్ సివిల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు బుధవారం నిరసన తెలిపారు. ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఐఎన్‌టీయూసీ మాజీ ప్రధాన కార్యదర్శి, జేసీఎం సభ్యుడు బీఎస్ ప్రకాష్ రావు మాట్లాడుతూ కార్మికులను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎన్ఏడీ యాజమాన్యం తక్షణమే స్పందించి ఆ 36 మందిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్ఏడీ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ ఎన్ఏడీ యాజమాన్యం కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. కార్మికులు తమ హక్కుల కోసం అడిగితే ఈ విధమైన చర్యలు తీసుకోవడం చాలా దారుణమన్నారు. కార్మికులకు ఐఎన్‌టీయూసీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## కాకరలోవలో అంధకారం!



కాకరలోవలో వెలగని వీధిలైటు ఉన్న స్తంభం

**సింధియా:** జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవలోని మీసేవ సెంటర్ వద్ద 12 రోజుల నుంచి వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చీకటి పడితే వీధుల్లో ప్రయాణించాలంటే భయమేస్తుందని వాపోతున్నారు. పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. తమ ఇబ్బందులను గుర్తించి వీధి లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## క్లుప్తంగా

### ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 10.44 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు

**కంచరపాలెం:** జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకుల సంయుక్త ఆధ్వర్యంలో హుండీలు లెక్కించారు. 32 రోజులకు గాను అమ్మవారికి ముడుపులు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.10,44,345 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. కరకచెట్టు అమ్మవారి దేవస్థానం ఈవో కె.గాయత్రి పర్యవేక్షణలో ఆదాయం లెక్కించారు. కార్యక్రమంలో కంచరపాలెం పోలీస్ కానిస్టేబుల్ రాంబాబు, కమిటీ సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

### మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



అంబలం పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

**సింధియా:** జీవీఎంసీ 62వ వార్డు పరిధి గుడివాడఅప్పన్నకాలనీలో మజ్జి మాలినాయుడు గురుస్వామి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అయ్యప్ప స్వామి అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. శబరిమల అయ్యప్ప స్వామి ఆలయ సెట్ వేసి వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 1000 మంది అయ్యప్ప దీక్షాధారులను పూజా మహోత్సవానికి ఆహ్వానించి శాస్త్రోక్తంగా అంబలం పూజ, పడి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే గణబాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

### స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి పెంపునకు సహకరించండి



సీజీఎం మహంతితో సమస్యలపై చర్చిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ఇప్పుడిప్పుడే ఊపందుకుంటుందని.. మరింత పెంచడానికి అందరూ సహకరించాలని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఆర్. మహంతి కోరారు. నూతన సీజీఎంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు బుధవారం ఆయన్ను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం మరింత ఉత్పత్తి పెంచేందుకు సన్నాహాలు చేస్తుందని.. ఉత్పత్తి పెంచడానికి కార్మిక సంఘాలు, ఉద్యోగులు కలిసి రావాలని కోరారు. నాయకులు మాట్లాడుతూ జీతాలు చెల్లించక పోవడం వల్ల కార్మికులు మానసిక స్థైర్యం కోల్పోతున్నారన్నారు. వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దాలినాయుడు, నాయకులు పుల్లారావు, ఎన్నేటి రమణ, టి.వి. శంకరరావు, డి. మహేశ్వరరెడ్డి, జి. అప్పలరాజు, ఎంవీరావు, జి. నూకరాజు, రామ్మూర్తి, అప్పలరాజు, జోగన్న, జి. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి టీటీడీ క్యాలెండర్ విక్రయాలు

**ఎంవీపీకాలనీ:** తిరుమల తిరుపతి దేవస్థానం రూపొందించిన క్యాలెండర్ విక్రయాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే క్యాలెండర్లు ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలోని కార్యాలయానికి చేరుకున్నాయి. బుధవారం సాయంత్రం టీటీడీ విశాఖ మేనేజర్ హైమావతి, పలువురు ఉద్యోగులు ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. తెలుగు పంచాంగం క్యాలెండర్ రూ.30, క్యాలెండర్(నెలవారి) రూ.130కి విక్రయించనున్నట్లు మేనేజర్ తెలిపారు. త్వరలో డైరీల విక్రయాలు కూడా ప్రారంభిస్తామన్నారు.

## కేంద్ర ఉక్కు మంత్రి ద్వంద్వ వైఖరి

- స్టీల్‌ప్లాంట్‌లో ప్రైవేటీకరణ లేదన్నారు.. పార్లమెంట్‌లో ఉందన్నారు
- బయట పడిన కేంద్ర ప్రభుత్వ వక్రబుద్ధి

**ఉక్కునగరం:** విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్ర ఉక్కుమంత్రి కుమారస్వామి భిన్న ప్రకటనలతో కేంద్ర ప్రభుత్వ వక్రబుద్ధి మరోసారి బయటపడింది. స్టీల్‌ప్లాంట్‌లో పర్యటించిన సమయంలో ప్రైవేటీకరణ జరగదని చెప్పిన కుమారస్వామి పార్లమెంట్ సాక్షిగా ప్రైవేటీకరణ ప్రక్రియ కొనసాగుతుందని ప్రకటించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని కూటమి నేతల నిజస్వరూపం బహిర్గతం చేసింది. లోకసభ సభ్యుడు కీర్తి ఆజాద్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి కుమారస్వామి సమాధానం ఇస్తూ.. స్టీల్‌ప్లాంట్‌లో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి లావాదేవీలు కొనసాగుతున్నాయని ప్రకటించడం ఉక్కు వర్గాలను నివ్వెరపరిచింది. సాధారణ ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోలేక పోయిందని, తాము అధికారంలోకి వస్తే ప్రైవేటీకరణ కాకుండా చూస్తామని హామీలిచ్చి గద్దెనెక్కిన కూటమి నేతలు.. ఇప్పుడు స్టీల్‌ప్లాంట్‌ను నిలువునా ముంచేశారు. ఇటీవల స్టీల్‌ప్లాంట్‌లో పర్యటించిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి అబ్బే ప్రైవేటీకరణ అంశమే లేదని ప్రకటించారు. రెండు నెలల సమయం ఇస్తే స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకునే విధంగా చేస్తామని ప్రకటించారు. ఆయన వచ్చి వెళ్లిన దగ్గర నుంచి స్టీల్‌ప్లాంట్ పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. ముడి పదార్థాల కొరత సృష్టించి ఒక బ్లాస్ట్‌ఫర్నేస్ నడిచేలా చేశారు. ఉద్యోగులకు జీతాలు సక్రమంగా ఇవ్వకుండా, ఉన్న సదుపాయాలకు కోత వేయడం ద్వారా తీవ్ర ఆర్థిక ఇబ్బందులోకి నెట్టి.. వారిని మానసికంగా దెబ్బతీస్తున్నారు. ఆదుకుంటామని ప్రకటన చేసి రూ.1,650 కోట్లు ఇచ్చారు. వాటితో ముడి పదార్థాల కొనుగోలు, జీఎస్టీ చెల్లింపు, బ్యాంకులకు చెల్లింపు ద్వారా ప్రభుత్వం ఆ మొత్తాన్ని తిరిగి తీసేసుకుంది. కాగా.. రాష్ట్రంలోని కూటమి నేతలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిపోయిందంటూ పెద్ద ఎత్తున ప్రకటనలు చేస్తున్నారు. విశాఖ ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రతీ సమావేశంలో ఇదే చెబుతూ మభ్యపెడుతున్నారు. ఇటీవల జరిగిన శాసనమండలి సమావేశాల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయనివ్వబోమని ప్రకటించారు. ఒకవైపు చాపకింద నీరులా ప్రైవేటీకరణ పనులు కొనసాగుతుండగా.. మరోవైపు ఆదుకుంటున్నట్టు ఇచ్చే బిల్డప్‌లు కూటమి నాయకుల మైండ్ గేమ్‌గా ప్రజలు భావిస్తున్నారు.

## 22న పీవోడబ్ల్యూ విశాఖ జిల్లా ఏడో మహాసభలు



మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రతినిధులు

**సీతమ్మధార:** ప్రగతిశీల మహిళా సంఘం ఏడో జిల్లా మహాసభలను ఈ నెల 22న నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మి తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. గాజువాక డ్రైవర్స్ కాలనీలోని గౌరి సత్యనారాయణ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు జెండా ఆవిష్కరణతో సభ ప్రారంభమవుతుందని తెలిపారు. సభా ప్రాంగణానికి బోయి విజయ భారతి ప్రాంగణంగా నామకరణం చేశామని పేర్కొన్నారు. మహిళా సంఘాల జాతీయ కోఆర్డినేటర్ ఝాన్సీ ప్రారంభోపన్యాసం చేస్తారని, రచయిత్రి విజయ భారతి స్మారకోపన్యాసం చేస్తారన్నారు. ప్రైవేటీకరణతో ఉపాధి అవకాశాలు కోల్పోతున్న మహిళలు అనే అంశంపై గూడూరు సీతామహాలక్ష్మి, ప్రసంగిస్తారని తెలిపారు. మహిళా ఉద్యమ కర్తవ్యాలపై పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, కార్యదర్శి పద్మ మాట్లాడతారన్నారు. మధ్యాహ్నం ప్రతినిధుల సభలో కార్యక్రమాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యక్రమం నిర్దేశించుకుంటామని, నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని తెలిపారు.

## ఆక్వా టెక్నీషియన్లకు శిక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న మత్స్య శాఖ జేడీ లక్ష్మణరావు, రవికుమార్, హనుమంతరావు

**మహారాణిపేట:** సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల సంస్థ(ఎంపెడా) విశాఖపట్నం ఆధ్వర్యంలో రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాల్లో పనిచేసే టెక్నీషియన్లకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం వర్చువల్‌గా ఎంపెడా డైరెక్టర్ డాక్టర్ కార్తికేయన్ ప్రారంభించారు. ఫిషింగ్ హార్బర్ సమీపంలోని సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎంఎఫ్‌ఆర్‌ఐ) కార్యాలయంలో నాలుగు రోజుల పాటు శిక్షణ జరుగుతుందన్నారు. దేశంలోని ఆక్వా ఉత్పత్తుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉందని డైరెక్టర్ తెలిపారు. సుస్థిర ఆక్వా సాగు, నాణ్యమైన రొయ్యల పిల్లల ఉత్పత్తి, నాణ్యమైన ఆక్వా ఉత్పత్తులపై ఆక్వా టెక్నీషియన్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. నిషేధిత ఆంటి బయోటిక్స్, ఆంటి మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై అవగాహన కల్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో హేచరీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.రవికుమార్, రాజ్‌కమల్ హేచరీస్ అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వరరావు, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు, ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్లు హనుమంతరావు, ఆర్.ప్రసాద్, వివిధ విభాగాల అధికారులు డాక్టర్ శంకరరావు, డాక్టర్ కందన్, డాక్టర్ విజయకుమార్, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ జోయ్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 30 మంది హేచరీస్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

## 124 బస్తాల పీడీఎస్ బియ్యం సీజ్

**తగరపువలస:** ఆనందపురం మండలం పెద్దిపాలెంలో గల శ్రీవాసవి ఎంటర్‌ప్రైజెస్ రైస్ మిల్లులో తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. లెక్కల్లో లేని 124 బ్యాగుల బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ మిల్లుపై 6ఎ కేసు నమోదు చేశారు. గత ఆరు నెలల కాలంలో పౌరసరఫరాల శాఖ నగర పరిధిలో 6ఎ కేసులు 123 నమోదు చేశారు. రూ.17.90 లక్షల విలువ చేసే 114.573 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేశారు. 13 వాహనాలను సీజ్ చేసి ఆరుగురు వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

## స్టేడియంలో పాము కలకలం



పోర్టు స్టేడియంలో పట్టుకున్న పామును చూపుతున్న కిరణ్ కుమార్

**సీతంపేట:** అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో బుధవారం ఉదయం పాము కలకలం రేపింది. స్టేడియంలో ఉన్న స్టాల్ వద్ద పాము కనిపించడంతో అక్కడున్న వారంతా హడలిపోయి పరుగులు తీశారు. స్టేడియం నిర్వాహకులు సమాచారాన్ని స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌కు తెలియజేశారు. స్టేడియంకు చేరుకున్న కిరణ్‌కుమార్ పామును చాకచక్యంగా పట్టుకున్నారు. అది జెర్రిపోతు అని, ప్రమాదకరమైన పాము కాదని, భయపడవలసిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. స్టేడియం వెనుక కొండలు, చెట్లు, పొదలు ఉండటం వల్ల పాములు సంచరించే అవకాశం ఉందన్నారు. ఎక్కడైన పాము కనబడితే తనకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పామును పట్టుకుని దూరంగా విడిచిపెట్టడంతో అక్కడి వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సిద్ధం కండి



మాట్లాడుతున్న ఏయూ వీసీ శశిభూషణరావు

**విశాఖ విద్య:** ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఈ నెల 7న పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుగుతున్న నేపథ్యంలో విభాగాధిపతులతో ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థులను ఆయా విభాగంతో అనుసంధానం చేయాలని సూచించారు. ప్రతి విభాగంలో ఉన్నతంగా ఎదిగిన పూర్వ విద్యార్థులను ఆహ్వానించడం, వారితో నేటితరం విద్యార్థులను అనుసంధానం చేయడం,విలువైన సూచనలు ప్రస్తుత తరానికి అందించే దిశగా కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, కె.సీతామాణిక్యం, నాగరాజకుమారి పాల్గొన్నారు.

## ‘బియాండ్ ది క్లాస్‌రూమ్’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

**విశాఖ విద్య:** ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగంలో ఇటీవల నిర్వహించిన జాతీయ సదస్సు పరిశోధనా పత్రాల సంకలనం మూడో సంచిక బియాండ్ ది క్లాస్‌రూమ్‌ను బుధవారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానంపై నిర్వహించిన జాతీయ సదస్సులో అనేక మంది నిపుణులతో చర్చలు, విలువైన సూచనలకు మార్గం చూపిందన్నారు. ఈ సదస్సులో సమర్పించిన పరిశోధనా పత్రాలను ప్రత్యేక సంచికగా తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు. పుస్తక సంపాదకులను అభినందించారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ కె.ఈశ్వర్‌కుమార్, ప్రత్యేక సంచిక సంపాదకులు, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్.ప్రకాశ్‌రావు, డాక్టర్ ఎం.అబ్దుల్ జుల్ఫికర్ అలీ పాల్గొన్నారు.

## ఆలోచనతో నిర్ణయాలు తీసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు



హాజరైన విద్యార్థినులు

**సింధియా:** ఒక్క క్షణం ఆలోచిస్తే భవిష్యత్తు ఎన్నో నేర్పిస్తుంది.. ఆ ఒక్క క్షణాన్ని నిర్లక్ష్యం చేస్తూ యువత తమ జీవితంతో పాటు ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యుల జీవితాలను కూడా రోడ్డున పడేలా చేస్తున్నారని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. 60వ వార్డు పరిధిలోని సెయింట్ ఆన్స్ హాస్పిటల్ ఆవరణలో బుధవారం సీనియర్ పాత్రికేయుడు ముప్పిడి గిరి అధ్యక్షతన ఆత్మహత్యల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్న చిన్న విషయాలకు ఒత్తిడికి లోనై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు, యువతలో ఒత్తిడి తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ములగాడ తహసీల్దార్ భుజంగరావు మాట్లాడుతూ వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకుని యువత ఆత్మవిశ్వాసంతో జీవించాలన్నారు. మల్కాపురం సీఐ విద్యాసాగర్ మాట్లాడుతూ ఆత్మహత్య మహాపాపమే కాక, మహా నేరమన్నారు. ఆత్మహత్యలను ప్రేరేపించే వారు నేరస్తులుగా పరిగణించబడతారన్నారు. ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలు, ప్రేమలో విఫలం అవడం వల్ల ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు.సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని.. గేమ్స్ ఆడడం, డ్రగ్స్, మానసిక ఆందోళన, అక్రమ సంబంధాలు మొదలైనవి ఆత్మహత్యలకు కారణాలని పేర్కొన్నారు. ఈ ఆత్మహత్యల వల్ల అమూల్యమైన ప్రాణాలను కోల్పోవడమే కాక వారిపై ఆధారపడిన వారు అనాథలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని పరిష్కరించడానికి ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకుని, దాని సాధనకై కృషి చేయాలని అంతా కోరారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి, సెయింట్ ఆన్స్ హాస్పిటల్ పరిపాలన అధికారి సిస్టర్ బిన్సీ, ప్రముఖ న్యాయవాది గిల్బర్ట్, సీనియర్ పాత్రికేయులు ఎస్.చలపతిరావు, ఎన్ఎస్ఎస్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, నవజ్యోతి మహిళా సంఘానికి చెందిన వెంకటలక్ష్మి, వై.అనసూయదేవి తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యం ఉన్నవారికే అపార అవకాశాలు



పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

**మురళీనగర్:** విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో బుధవారం విశాఖ రీజియన్ స్థాయి పాలిటెక్ ఫెస్ట్–2024ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సబ్జెక్ట్‌పై ఎంత పట్టు ఉన్నా.. సమాచార నైపుణ్యాలు ఉన్నప్పుడే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. రోజు రోజుకూ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా మనం మారాల్సి ఉందన్నారు. కంచరపాలెం పాలిటెక్నిక్‌లో కంప్యూటర్స్, ఈసీఈ బ్రాంచిలు లేవన్న విషయం తన దృష్టికి వచ్చిందని, వీటిని మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ముందుగా ఆయన ఎలక్ట్రానిక్ విధానంతో సెల్‌ఫోన్ ద్వారా జ్యోతి ప్రజ్వలన, రిబ్బన్ కత్తిరించి ఫెస్ట్‌ను ప్రారంభించారు. దీన్ని రూపొందించిన విద్యార్థులు చైతన్య, పూర్ణ, ఎలక్ట్రానిక్ విభాగం ఉద్యోగి స్టాలిన్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అలరించాయి. విద్యార్థులు రూపొందించిన సాంకేతిక నమూనాలు ఆలోచింపజేశాయి. టెక్నికల్ ఎడ్యుకేషన్ అకడమిక్ డీడీ కె.విజయభాస్కర్, ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.నారాయణరావు, డాక్టర్ కె.వెంకటరమణ, హెచ్‌వోడీలు కేడీవీ నరసింహారావు, జె.రాజేంద్రప్రసాద్, కె.రత్నకుమార్, ఎం.హరిబాబు, జె.గోవర్ధన్‌రావు, స్టూడెంట్ అడ్వైజర్ ఎస్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు. టెక్ ఫెస్ట్‌లో 8 ప్రభుత్వ, 17 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలకు విద్యార్థులు 192 నమూనాలు ప్రదర్శించారు.